అభిమాన నేతకు తోడుగా..

- మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన జిల్లా నేతలు

చౌటుప్పల్, నవంబర్ 25 : కొడంగల్ నియోజవర్గంలోని లగచర్ల గిరిజన, దళిత రైతులపై కాంగ్రెస్ సర్కార్ దమనకాండకు నిరసనగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చేపట్టిన మహాధర్నాకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వెళ్తూ చౌటుప్పల్‌లో కొద్దిసేపు ఆగారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని వందలాది మంది కార్యకర్తలు అక్కడకు చేరుకొని కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు కలిసి అలైన్‌మెంట్ మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం లేదా భూమికి బదులు భూములు ఇప్పించేందుకు కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ట్రిపుల్ ఆర్ విషయంపై మాట్లాడుతానన్నారు. బాధితులకు సరైన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి, జిల్లా నాయకులు గిర్కటి నిరంజన్‌గౌడ్, పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, ఢిల్లీ మాధవరెడ్డి, ముటుకుల్లోజు దయాకరాచారి, మల్లేశ్‌గౌడ్, వెంకటేశం యాదవ్, మల్లేశంగౌడ్, పర్వతాలు యాదవ్, కృష్ణయ్య ఉన్నారు.

భూదాన్ పోచంపల్లి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను 65వ జాతీయ రహదారిపై కొత్తగూడెం వద్ద ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు కలిసి శాలువాలతో సత్కరించి బొకేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, నాయకులు మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, కోట పుష్పలతమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, నాయకులు ఉన్నారు.

కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

ఆత్మకూరు(ఎం) : కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ ఆత్మకూరు(ఎం) మండలం నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, సోషల్ మీడియా మండల కన్వీనర్ విజయ్‌కుమార్ ఉన్నారు.

రామన్నపేట : చిట్యాలలో కేటీఆర్‌కు షేక్‌హ్యాండ్ ఇస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

మాజీ మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న ట్రిపుల్ ఆర్ బాధితులు

భూదాన్ పోచంపల్లి : కేటీఆర్ రాక కోసం కొత్తగూడెం వద్ద వేచిచూస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్రకుమార్, భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

అంబుజాను అడ్డుకుందాం.. త్వరలోనే రామన్నపేటకు వస్తా

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రామన్నపేట, నవంబర్ 25 : త్వరలోనే రామన్నపేటకు వస్తా.. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. సోమవారం మహబూబాబాద్‌లో ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న కేటీఆర్‌కు చిట్యాలలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కేటీఆర్‌ను శాలువాలతో సన్మానించి పూల బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు విషయాన్ని ప్రస్తావించగా.. కాలుష్య సిమెంట్ పరిశ్రమను అడ్డుకొని తీరుదామని, మీతో కలిసి పోరాడేందుకు వీలైనంత త్వరగా రామన్నపేటకు వచ్చి ప్రజలను కలుస్తానని కేటీఆర్ చెప్పారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, నాయకులు బొక్క మాధవరెడ్డి, బందెల రాములు, వేమవరపు సుధీర్‌బాబు, రమేశ్‌యాదవ్, బలరాం, విక్రమ్, అశోక్, మల్లేశం, వెంకటేశం, ముత్తయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

గుట్టలో వైభవంగా కార్తిక వ్రత పూజలు

సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, నవంబర్ 25 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తిక వ్రత పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో వ్రతమాచరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయమే కార్తిక దీపారాధన గావించిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కొండ కింద సత్యనారాయణస్వామి వ్రత మండపంలో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామునే ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేపట్టి నిజరూపంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. రామలింగేశ్వర కుటుంబంతోపాటు ఆలయంలో స్పటిక లింగేశ్వరుడికి ప్రభాతవేళ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని జరిపారు. సాయంత్రం రామలింగేశ్వరుడి సేవను శివాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. సుమారు 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.44,70,794 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం

సీతారామచంద్రస్వామి ఆలయంలో దీపాలు వెలగిస్తున్న మహిళలు

చౌటుప్పల్, నవంబర్ 25 : పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో దీపాలు వెలగించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంస్థ ప్రతినిధులు రాజేందర్‌రెడ్డి, యనాల ప్రభాకర్‌రెడ్డి, కేవీబీ కృష్ణారావు, ఉజ్జిని మంజుల పాల్గొన్నారు.

పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో కార్తిక పూజలు

పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

భువనగిరి అర్బన్, నవంబర్ 25 : కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లూరి రాజు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి కె.నాగరాజుశర్మ మహన్యాస రుద్రాభిషేకం, గణపతి హోమం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించారు. అయ్యప్ప, శివ మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అన్నదాన దాతలు నర్సింగ్‌రావు, సంధ్యారాణి, బింగి రాము, మంజుల, రఘు, విజయలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, రవీందర్‌రెడ్డి, జంగయ్య, నర్సింహ, గంగాధర్, ప్రకాశ్, దేవేందర్ పాల్గొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ ప్రింటింగ్ వస్త్రాలను అరికట్టాలి

- టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు లవకుమార్

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 25 : పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రింటింగ్‌ను అరికట్టాలని టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ అన్నారు. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన జీఐ అండ్ బియాండ్, విరాసిత్ సే వికాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కత్ ప్రింటింగ్‌తో చేనేత వస్త్రాలకు నష్టం వాటిల్లుతుందని, కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. పోచంపల్లి ఇక్కత్ భారతదేశంలోని మొట్టమొదటి టెక్స్‌టైల్ రంగంలో జీఐ గుర్తింపు పొందిందన్నారు. అనంతరం హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.బీనాకు వినతి పత్రం అందజేశారు. ప్రింటింగ్ వస్త్రాలను అరికట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని కేంద్ర అధికారులు తెలిపారు.

హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.బీనాకు వినతి పత్రం ఇస్తున్న టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు లవకుమార్

మునిపంపులలో చిల్డ్రన్స్ ఫెస్టివల్

రామన్నపేట, నవంబర్ 25 : మండలంలోని మునిపంపుల గ్రామంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో సోమవారం చిల్డ్రన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో భాగంగా శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసం, కవిత్వాలు, వేమన పద్యాల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక బాధ్యతను, సాహిత్య దక్షతను చిన్నతనం నుంచే అలవర్చుకొని సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం నిర్వాహకుడు బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు వెలిమినేటి మల్లేశం, మేడి మధుబాబు, ముత్యాలు, చంద్రశేఖర్, శివకుమార్, రమేశ్, నాగార్జున పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పాముకాటుతో రైతు మృతి

వలిగొండ, నవంబర్ 25 : పశువులకు గడ్డివేయడానికి వెళ్లిన రైతు పాముకాటుతో నురగలు కక్కుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గోపరాజుపల్లి గ్రామానికి చెందిన రైతు గాజుల వెంకటేశం వ్యవసాయ బావి దగ్గర ఉన్న తన పశువులకు గడ్డి వేయడానికి సోమవారం సాయంత్రం వెళ్లాడు. కొద్దిసేపటికి నురగలు కక్కుతూ ప్రాణాపాయ స్థితిలో ఉండటాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిన వైద్యులు చాతిపై పాముకాట్ల వంటి గాట్లను గుర్తించారు. పాముకాటుతో మృతిచెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం చేస్తేగాని కారణాలు తెలుపలేమని వైద్యులు తెలిపినట్లు 108సిబ్బంది సాలయ్య చెప్పారు.

బైకు గుంతలో పడి వ్యక్తి మృతి

పింటూ సాబ్ (ఫైల్)

అడ్డగూడూరు, నవంబర్ 25 : మండల కేంద్రంలో సోమవారం బైకు అదుపుతప్పి గుంతలో పడిన ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురజాల నుంచి చౌళ్లరామారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులో హిటాచీ నడిపే జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పింటూ సాబ్ (30) ఆదివారం రాత్రి 10గంటల సమయంలో మండల కేంద్రంలో భోజనం చేసి మిషన్ దగ్గరికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం చుట్టుపక్కల రైతులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

భువనగిరి నుంచి ఉప్పల్‌కు డీలక్స్ బస్సులు ఏర్పాటు చేయాలి

భువనగిరి అర్బన్, నవంబర్ 25 : భువనగిరి బస్టాండ్ నుంచి ఉప్పల్ వరకు డీలక్స్ బస్సులు ఏర్పాటు చేయాలని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడారి వెంకటేశ్ అన్నారు. భువనగిరి బస్టాండ్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాటాడారు. భువనగిరి నుంచి హైదరాబాద్‌కు రోజూ వేలాది మంది ప్రయాణం చేస్తారని, సరైన సమయంలో ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బస్సులు తక్కువగా ఉండడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తున్నారని తెలిపారు. జనగాం, హన్మకొండ, వరంగల్ డిపోల బస్సులు బైపాస్ నుంచి వెళ్తున్నాయని, భువనగిరి బస్టాండ్‌కు వచ్చేలా చూడాలని డిపో మేనేజర్‌ను కోరారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

పత్తి మిల్లులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు(ఎం), నవంబర్ 25 : మండల కేంద్రంలోని సిద్ధేశ్వర పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైంది. సీసీఐ ఆధ్వర్యంలో రైతుల నుంచి 25వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా.. అందులో 78మంది రైతులకు సంబంధించిన 2వేల క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు నిర్వాహకులు తెలిపారు. మంటలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు వెంటనే వచ్చి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.

అసభ్యకర పోస్టు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- యాదగిరి గుట్ట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నాయకులు

యాదగిరిగుట్ట, నవంబర్ 25 : మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతులపై సోషల్ మీడియా వేదికగా అసభ్యకరమైన పోస్టు పెట్టిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య కోరారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్ఐ అనిల్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. యాదగిరిగుట్టకు చెందిన బొందుగుళ్ల బాబు అనే వ్యక్తి 'యాదాద్రి జిల్లా రాజకీయాలు' అనే సోషల్ మీడియా గ్రూప్‌లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఫొటోను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా, వ్యక్తిని కించపరిచే విధంగా పోస్టు చేశాడన్నారు. ఆలేరు అభివృద్ధి ప్రదాత, మహిళా నాయకురాలైన గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిని అవమానపరిచే విధంగా, మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టు ఉందని తెలిపారు. వెంటనే వ్యక్తిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు మిట్ట వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు పేరబోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్‌గౌడ్, ముక్కెర్ల సతీశ్, ఆవుల సాయి, యాకూబ్, గడ్డం చంద్రం, బండి వాసు, వీరేశం, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలి : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 25 : గౌరెల్లి – భద్రాచలం రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేదంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర అయినా చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు పేరుతో వివిధ గ్రామాల రైతుల పంట పొలాలను ప్రభుత్వం గుంజుకోవడం దారుణమన్నారు. బహిరంగ మార్కెట్లో ఎకరం భూమి కోటి నుంచి మూడు కోట్ల వరకు పలుకుతుందని, ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.7.5 లక్షలు మాత్రమే ఉందని చెప్పడం దారుణమని పేర్కొన్నారు. భూమి కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ప్రకారం ధర చెల్లించకుంటే రైతాంగాన్ని సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం భూములు కోల్పోతున్న పిల్లాయిపల్లి రైతులతో కలిసి డిప్యూటీ తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు ప్రసాదం విష్ణు, కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి, జంగయ్య, కృష్ణారెడ్డి, పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

'ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలి'

ధర్నా చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నరేందర్ మహారాజ్

భువనగిరి అర్బన్, నవంబర్ 25 : ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని, ఉపాధి, భూమి, ఇల్లు ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నరేందర్‌మహారాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలని, నిరుద్యోగులకు ఉపాధి, అర్హులైన వారికి సాగునీటి వసతిగల ఎకరం భూమి, 200 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్, సామాజికవేత్త బట్టు రాంచంద్రయ్య, జిల్లా నాయకులు శ్రీను, లింగస్వామి, నర్సింగ్, శ్రీకాంత్, మహేశ్, స్వామి, రవి, అశోక్, నరేందర్, శాంతికుమార్, పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం సర్వేలో నమోదు చేసుకోవాలి : ఎంపీడీఓ

వలిగొండ, నవంబర్ 25 : ఇంటింటి సమగ్ర సర్వేలో ప్రతి కుటుంబం తమ వివరాలతోపాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో సర్వేకు అందుబాటులో లేనివారు పంచాయతీ కార్యదర్శులను, సమగ్ర కుటుంబ సర్వే నోడల్ అధికారిని లేదా ఎంపీడీఓను సంప్రదించి తమ కుటుంబ వివరాలను నమోదు చేయించేకోవాలని సూచించారు.

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

భువనగిరి అర్బన్, నవంబర్ 25 : విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ విజయ్‌కృష్ణ అన్నారు. పట్టణంలోని చైతన్య పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలను నడుపవద్దన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలను హెల్మెట్ లేకుండా, కారును సీట్ బెల్ట్ లేకుండా నడుపవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలి

- అలసత్వం వహిస్తే చర్యలు : కలెక్టర్ హనుమంతరావు

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 25 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించాలని, వినతులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రజావాణి సమస్యలపై అధికారులు అలసత్వం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సోమవారం ప్రజల నుంచి 30 దరఖాస్తులు అందాయని, అందులో రెవెన్యూ శాఖకు–17, జిల్లా పంచాయతీ అధికారికి–2, జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖకు–2, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖకు –2, డీఈఈ హౌసింగ్, చేనేత, వ్యవసాయ, పోలీస్, జిల్లా కో ఆపరేటివ్, ఈఈ వాటర్ వర్క్స్, వైద్య ఆరోగ్య శాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్‌ప్రసాద్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి లింగారెడ్డి

డి.రేపాక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి లింగారెడ్డి

అడ్డగూడూరు, నవంబర్ 25 : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి అన్నారు. మండలంలోని డి.రేపాక, చౌళ్లరామారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట సరుకులను పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వ చేసుకోవాలన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీలను ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నర్ర సబిత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ

రాజాపేట, నవంబర్ 25 : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.రామకృష్ణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రొటీన్ ఇమ్యూనైజేషన్ మైక్రో యాక్షన్ ప్లాన్ శిక్షణకు సంబంధించిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ భరత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తనిఖీ

పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి యాదయ్య

మోత్కూరు, నవంబర్ 25 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా బీసీ సంక్షేమాధికారి, మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం బియ్యం, విద్యార్థులకు అందించే కోడి గుడ్ల నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి


నర్సాపురంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

రాజాపేట, నవంబర్ 25 : మండలంలోని నర్సాపూర్ ప్రాథమిక పాఠశాలను మండల ప్రత్యేకాధికారి జింకల శ్యాంసుందర్, ఎంపీఓ ఆవుల కిషన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.